సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 28 । మార్చి । 2025




కీలక శాఖ.. సిబ్బంది లేక

ప్రభుత్వ యంత్రాంగంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకం. ఇందులో సిబ్బంది కొరత ప్రజలను వేధిస్తోంది. 10లో▸



నష్టాన్ని అంచనా వేస్తాం

కాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను కొడంగల్ ఏడీఏ శంకర్ రాథోడ్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 10లో▸



చిన్న శేష వాహనంపై శ్రీవారు

శేష వస్త్రాలు సమర్పించిన టీటీడీ అధికారులు

- శాస్త్రోక్తంగా పూజలు



చిన్న శేష వాహనంపై మాఢ వీధుల్లో విహరిస్తున్న స్వామివారు

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్‌లోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ఉదయం స్వామివారు చిన్న శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులను అందంగా అలంకరించారు. భక్తుల దర్శనార్థం ఆలయ మాఢ వీధుల్లో ఊరేగించారు. చిన్న శేష వాహనంపై బదిరీ నారాయణమూర్తిగా స్వామివారిని అలంకరించారు. మధ్యాహ్నం అభిషేకం నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలతో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. బుధవారం రాత్రి స్వామివారు పెద్ద శేష వాహనంపై అనంత పద్మనాభస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి ఆలయంలో మూలమూర్తికి విశేష పూలతో అలంకరణ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు కొడంగల్‌లో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ కార్యనిర్వాహణాధికారి లోకనాథం గురువారం కొడంగల్‌కు చేరుకొని స్వామివారికి శేష వస్త్రాలు సమర్పించారు. ప్రతిఏటా ఇలా చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



పెద్ద శేష వాహనంపై శ్రీవారు

న్యూస్‌రీల్

గడువు పెంపుపై హర్షం

బంట్వారం: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువును మే 31వ తేదీ వరకు పొడిగించడంపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయా వర్గాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే క్విజ్ పోటీలు

విద్యాశాఖ జిల్లా మానిటర్ రాము



క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

మోమిన్‌పేట: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడం కోసమే క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ జిల్లా మానిటర్ రాము తెలిపారు. గురువారం వికారాబాద్‌లో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. బూర్గుపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచే పోటీల్లో పాల్గొని సత్తాచాటాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అపరేషన్ మేనేజరు కాశీనాథ్, జిల్లా సీనియర్ మేనేజర్లు నాగరాజు, రాజు, చిరంజీవి, సత్యానందం, యాదయ్య, రమేశ్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుంకిమెట్ల తైబజార్ వేలం


రూ.2.75 లక్షలకు దక్కించుకున్న చాకలి నర్సింలు



తైబజార్‌కు వేలం నిర్వహిస్తున్న అధికారులు

బొంరాస్‌పేట: మండలంలోని తుంకిమెట్ల తైబజారు(ఆదివారం సంత)కు గురువారం ఎంపీడీఓ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన చాకలి నర్సింలు, బెస్త పోచప్ప మరి కొందరు వేలంలో పాల్గొన్నారు. చాకలి నర్సింలు రూ.2.75 లక్షలకు పాట పాడి తైబజారును దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రవి తదితరులు పాల్గొన్నారు.

ముజాహిద్‌పూర్‌లో..



కిష్టయ్యకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు, నాయకులు

కుల్కచర్ల: గ్రామాలు ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. గురువారం మండలంలోని ముజాహిద్‌పూర్‌లో పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఆధ్వర్యంలో తైబజార్ వేలాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన కిన్నెర కిష్టయ్య రూ.1.65లక్షలకు వేలం హక్కులు పొందారు. కార్యక్రమంలో చంద్రభూపాల్, సార శ్రీనివాస్, అనంతయ్య, షర్ఫొద్దీన్, పెంటయ్య, బాలకృష్ణ, వెంకట్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న కలెక్టర్, సబ్ కలెక్టర్

అనంతగిరి: ప్రభుత్వం అందజేస్తున్న నష్ట పరిహారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. దుద్యాల మండలం, హకీంపేటకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన భూ సేకరణకు సమ్మతి తెలిపిన వారికి గురువారం తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర ప్రసాద్‌తో కలిసి చెక్కులు అందజేశారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. పారిశ్రామిక పార్కులో భూములు కోల్పోతున్న వారికి ఒకే విడతలో పరిహారం చెక్కులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుద్యాల తహసీల్దార్ కిషన్, సెక్షన్ సూపరింటెండెంట్ నఫీస్‌ఫాతిమా, టీఎస్ ఐఐసీ అసిస్టెంట్ మేనేజర్ అనురాధ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కడుపుకోతలే..!

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇబ్బడిముబ్బడిగా సిజేరియన్ ప్రసవాలు





- హైరిస్క్ పేరిట అధిక ఫీజుల వసూలు
- సర్కారు దవాఖానాల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత
- జిల్లాలో గడిచిన ఏడాది కాలంలో 15,843 కాన్పులు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో 11,094, ప్రైవేటులో 4,500 డెలవరీలు
- పీహెచ్‌సీల్లో తగ్గిన సంఖ్య

వికారాబాద్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్లకే మొగ్గు చూపుతున్నారు. సాధారణ ప్రసవాలకు అవకాశం ఉన్నా సిజేరియన్ చేసి అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి పది కాన్పుల్లో ఎనిమిది ఈ తరహాలోనే చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. పీహెచ్‌సీల్లో మాత్రం ప్రసవాల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రుల్లో ఎక్కువ డెలవరీలు జరుగుతున్నాయి. అయితే సరైన సదుపాయాలు లేకపోవడం సమస్యగా మారుతోంది.

15శాతం లోపే హైరిస్కు కేసులు

సాధారణంగా వందకు పది నుంచి 15 శాతం లోపే ప్రసవాల్లో హైరిస్క్ కేసులు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపితే హైరిస్క్ కేసుల్లోనూ సగానికిపైగా సాధారణ డెలివరీలు జరిగేందుకు అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో 80 శాతం మేర సిజేరియన్‌లే ఉంటున్నాయి. గడిచిన ఏడాది కాలంలో 4,500 ప్రసవాలు చేయగా ఇందులో 3,749 సిజేరియన్ కాన్పులు ఉన్నాయి. కేవలం 751 సాధారణ ప్రసవాలు జరిగాయి.ఒక్కో ఆపరేషన్‌కు రూ.60 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. కొన్ని సందర్భాల్లో హైరిస్క్ కేసుల పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు.

పీహెచ్‌సీల్లో తగ్గుముఖం

పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య రోజురోజుకూ తగ్గుతోంది. జిల్లాలో రూరల్, అర్బన్ ఏరియాల్లో 24 పీహెచ్‌సీలు ఉన్నాయి. ఆరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 24 గంటల పాటు వైద్యసేవలు అందిస్తున్నాయి. మిగతావి పగలు మాత్రమే పనిచేస్తున్నా యి. 24 గంటల ఆస్పత్రుల్లో ప్రసవాలు చేస్తున్నారు. గడిచిన నెలలో అంగడి రాయచూర్ పీహెచ్‌సీలో 5 ప్రసవాలు, బొంరాస్‌పేటలో 5, దోమలో 4, కుల్కచర్లలో 14, మోమిన్‌పేటలో 4 కాన్పులు జరగ్గా నవాబుపేటలో ఒక్క డెలవరీ కూడా చేయలేదు.

సదుపాయాలు లేక..

కొన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కావాల్సిన పరికరాలు ఉన్నా వాటిని ఉపయోగించక పోవడంతో మూలకు చేరాయి. మరి కొన్ని చోట్ల సదుపాయాలు లేక వైద్యులు ఇబ్బందులు పడుతున్నారు. పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు అన్ని ఉన్నా వైద్యం సక్రమంగా అందడంలేదు. రోజుకు ఒక్కరు చొప్పున వైద్యులు 24 గంటలపాటు విధులు నిర్వహించి నాలుగు రోజుల తర్వాత డ్యూటీకి వస్తున్నారు. ఓపీ సమయంలో వైద్యులందరూ ఉండాల్సి ఉన్నా ఒకరిద్దరు మాత్రమే విధుల్లో ఉంటున్నారు. వికారాబాద్ జనరల్ ఆస్పత్రిలో 86 మంది వైద్యులు, 250కి పైగా సిబ్బంది ఉన్నా సరైన సదుపాయాలు లేక సిబ్బంది, రోగులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి గదుల్లో నలుగురు వైద్యులు ఓపీ చూడాల్సి వస్తోంది. గతంలో సీహెచ్‌సీ నిర్వహించిన చోటే ప్రస్తుతం జనరల్ ఆస్పత్రి సేవలు కొనసాగుతున్నాయి. రెండేళ్ల క్రితమే భవన నిర్మాణ పనులు చేపట్టినా పూర్తి కాలేదు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ లాంటి పరికరాలు లేక రోగులు ప్రైవేట్ గడప తొక్కాల్సి వస్తోంది. తాండూరు జిల్లా ఆస్పత్రిలో, మెటర్నటీ సెంటర్‌లో సైతం సదుపాయాలు లేక సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

ఏడాదిలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నమోదైన ప్రసవాలు

ఆస్పత్రులు	సాధారణం	సిజేరియన్లు
ప్రభుత్వ	7,130	3,963
ప్రైవేట్	751	3,749
జిల్లా వెలుపల జరిగిన కాన్పులు		250

పీహెచ్‌సీల్లో కాన్పుల సంఖ్య పెంచుతాం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం. జిల్లాలో ఆరు రౌండ్‌ది క్లాక్ పీహెచ్‌సీలు ఉన్నాయి. వాటిలో కాన్పులు చేయాలని వైద్యులకు సూచించాం. మిగతా పీహెచ్‌సీలకు నెలలు నిండిన గర్భిణులు వస్తే ప్రథమ చికిత్స చేసి సీహెచ్‌సీ, మెటర్నటీ సెంటర్, జిల్లా, జనరల్ ఆస్పత్రులకు రెఫర్ చేయాలని ఆదేశించాం

– వెంకటరవణ, డీఎంహెచ్‌ఓ, వికారాబాద్



అర్బన్ పార్కులో వాకింగ్ పాత్‌ను కొలతలు తీస్తున్న దర్యాప్తు అధికారులు, (ఇన్‌సెట్లో) తాండూరు కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంక్వైరీ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు

దర్యాప్తు ముమ్మరం

- అర్బన్ పార్కు పనుల్లో అవినీతి జలగలపై చీఫ్ కన్జర్వేటర్ సీరియస్
- విచారణకు ఫ్లయింగ్ స్క్వాడ్ నియామకం
- రోడ్డు కొలతలు, మట్టి తవ్విన ప్రదేశాల పరిశీలన
- ఎంబీ రికార్డుల స్వాధీనం
- 'సాక్షి' కథనంతో కొనసాగుతున్న దర్యాప్తు

సాక్షి ఎఫెక్ట్..

బషీరాబాద్: తాండూరు సమీపంలోని అంతారం – గొట్లపల్లి అర్బన్ పార్కులో జరిగిన అక్రమాలపై రాష్ట్ర అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ ప్రియాంక వర్గీస్ దర్యాప్తునకు ఆదేశించారు. డీఎఫ్ఓ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ముగ్గురు ప్రత్యేక అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్‌ను నియమించింది. డీఎఫ్ఓ వీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో రేంజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, డిప్యూటీ రేంజర్ ప్రసన్నకుమార్, ఎస్ఓ శ్రీకాంత్ రంగంలోకి దిగారు. గురువారం వీరు అర్బన్ పార్కులో పర్యటించింది. తాండూరు మండల బీట్ ఆఫీసర్ మల్లయ్య, సెక్షన్ అధికారి ఫీర్యానాయక్ కాంట్రాక్టర్లుగా మారి రూ.16 లక్షల నిధులతో చేపట్టిన వాకింగ్ పాత్ పనుల్లో భారీ అక్రమాలకు పాల్పడినట్లు 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. విచారణ అధికారులు వాకింగ్ పాత్‌ను కొలతలు తీశారు. అలాగే మొరం కోసం చెట్లను తొలగించిన ప్రదేశాన్ని పరిశీలించి కొలతలు తీసుకున్నారు. అనంతరం తాండూరు రేంజర్ కార్యాలయానికి చేరుకొని పనుల అంచనాల కాపీలు, ఎంబీ రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించడానికి దర్యాప్తు అధికారి శ్రీనివాస్ రావు నిరాకరించారు. చీఫ్ కన్జర్వేటర్‌కు నివేదిక అందజేస్తామని వెల్లడించారు. దర్యాప్తు అధికారుల వెంట తాండూరు ఎఫ్ఆర్ఓ శ్రీదేవి సరస్వతి ఉన్నారు.

ధాన్యం సేకరణకు సర్వం సిద్ధం

- ఇప్పటికే 34 కేంద్రాలను ఏర్పాటు చేశాం
- దివ్యాంగులకు ఐడీ కార్డులు అందజేస్తాం
- ఉన్నతాధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

అనంతగిరి: యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం సేకరణ కోసం జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 34 సెంటర్లను ఏర్పాటు చేశామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సీఈఓ దివ్య గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సరిపోయే మేర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ నిర్ధారణ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ మెషీన్లు సమకూరుస్తామని చెప్పారు. ఆస్పత్రుల్లో దివ్యాంగులను నిర్ధారణకు అవసరమైన పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. దివ్యాంగులకు యూడీఐడీ కార్డులు జారీ చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ఉన్నతాధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, సరోజ, మోహన్ బాబు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లించు.. మాఫీ వర్తించు

- ఈనెల 31లోపు ఆస్తి పన్ను చెల్లిస్తే తొంభైశాతం వడ్డీ మాఫీ
- తాండూరులో ఇప్పటివరకు వసూలైంది 37.55 శాతమే
- వేగం పెంచిన మున్సిపల్ అధికారులు
- మరో నాలుగు రోజులే గడువు



తాండూరు మున్సిపల్ కార్యాలయం

తాండూరు: మున్సిపాలిటీల్లో పేరుకుపోయిన ఆస్తి పన్ను మొండి బకాయిలను వసూలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఓటీఎస్(వన్‌టైమ్ సెటిల్మెంట్)ను అమలు చేస్తోంది. ఒకేసారి ఆస్తిపన్ను చెల్లించిన ఇంటి యజమానులకు 90 శాతం వడ్డీ మాఫీ వర్తించేలా ఈనెల 25న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ లెక్కన మున్సిపాలిటీలో పేరుకుపోయిన పెండింగ్ బిల్లులను పూర్తి స్థాయిలో చెల్లిస్తే బకాయిదారులకు రూ.3.50 కోట్ల వడ్డీ మాఫీ అవుతుంది. ఈనెల 31లోపు చెల్లించే వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది.

లక్ష్యం రూ.13.57 కోట్లు..

తాండూరు మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో మొత్తం 14,706 గృహాలున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను 13.57 కోట్ల ఆస్తి పన్ను డిమాండ్ ఉంది. ఆర్థిక సంవత్సరం ముగింపులోపు వంద శాతం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ శాఖ అధికారులు టార్గెట్ విధించారు. కానీ ఆశించిన స్థాయిలో వసూలు కాలేదు. దీంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగానే వడ్డీ రాయితీ వెసులుబాటును కల్పించింది. ఈ అంశంపై అవగాహన కల్పిస్తున్న బిల్ కలెక్టర్లు వసూలు ప్రక్రియను వేగవంతం చేశారు. టాక్స్‌ల రూపంలో రూ.13.57 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. రూ.3.62 కోట్లు రాబట్టారు. దీంతో 37.55 శాతం బకాయిలు వసూలయ్యాయి.

31లోపు చెల్లిస్తే వడ్డీ మాఫీ

ఆస్తి పన్నులు రాబట్టేందుకు ప్రభుత్వం జీఓ నంబర్ 154ను జారీ చేసింది. దీని ద్వారా ఈనెల 31వ తేదీలోపు బకాయిలు చెల్లించేవారికి వడ్డీపై తొంభై శాతం మాఫీ వర్తిస్తుంది. తాండూరు మున్సిపల్ పరిధిలో ప్రాపర్టీ టాక్స్ చెల్లించే గృహ యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మరో 4 రోజుల గడువు ఉన్నందున సాధ్యమైనంత త్వరగా చెల్లించాలి.

– విక్రంసింహారెడ్డి, కమిషనర్, తాండూరు మున్సిపల్

ఎంపీడీఓ గదిలో నాగుపాము

తాండూరు రూరల్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పాములు బెడద రోజు రోజుకు పెరుగుతుంది. గతంలో ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో కొండచిలువ కనిపించిందని సిబ్బంది తెలిపింది. తాజాగా గురువారం ఎంపీడీఓ గదిలోనే నాగుపాము ప్రత్యక్షమైంది. ఉదయం గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన అటెండర్‌కు విషసర్పం కనిపించింది. ఆయన భయంతో వెంటనే కార్యాలయ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో గదిలో ఉన్న నాగుపామును కర్రలతో కొట్టి చంపేశారు. ఉద్యోగులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఎంపీడీఓ, ఏపీఓ, ఎంఈఓ, ఐకేపీ, డీఎల్‌పీఓతో పాటు పలు కార్యాలయాల పరిసరాల్లో ముళ్లపొదలు ఉండటంతో విషసర్పాలు తిరుగుతున్నాయని సిబ్బంది తెలిపారు. నిత్యం భయందోళన చెందుతున్నామని పేర్కొన్నారు.



సిబ్బంది చంపిన నాగుపాము

పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎంఆర్

తాండూరు: తాండూరు నియోజకవర్గంలో మైనార్టీలు ఎక్కువగా ఉన్నందున వారి కోసం పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి కోరారు. గురువారం శాసనసభలో మరోసారి మాట్లాడే అవకాశం వచ్చింది. ఈ సందర్భంగా ఆయన తాండూరు సమస్యలనుప్రస్తావించారు. హైదరాబాద్ తరహాలో వికారాబాద్ పట్టణ శివారులోని శివారెడ్డి పేట్ శివసాగర్ చెరువును అభివృద్ధి చేయాలని కోరారు. తాండూరు పట్టణంలో గొల్ల చెరువును అభివృద్ధి చేస్తే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి సీతక్క ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలను నోట్ చేసుకున్నట్లు తెలిపారు.



శాసనమండలిలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

యాజమాన్య హక్కులు కల్పించాలి: శాసన మండలిలో పట్నం

తాండూరు: జిల్లాలో దశాబ్దాలుగా అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు యాజమాన్య హక్కులు కల్పించాలని శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మంత్రి కొండా సురేఖను కోరారు. గురువారం మండలిలో జరిగిన ప్రత్యేక చర్చలో జిల్లాలో గిరిజన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. తాండూరు, యాలాల, బషీరాబాద్ మండలాల్లో ఎక్కువ మంది అటవీ భూములను సాగు చేసుకుంటు న్నారని తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజనులకు హక్కులు కల్పిస్తే వారి ఉపాధికి సమస్య ఉండదన్నారు. స్పందించిన మంత్రి కొండా సురేఖ ఈ అంశాన్ని నోట్ చేసుకున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి
కలెక్టర్ ప్రతీక్‌జైన్


విద్యార్థుల నాటక ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఇంగ్లిష్ మాట్లాడటం, అనర్గళంగా చదవడం హర్షించదగిన విషయమని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. యంగ్ ఓరేటర్స్ క్లబ్, బొస్ఫ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విద్యాకదంబం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో వివిధ కృత్యాలు ఆధారంగా సులభ పద్ధతుల్లో విద్యార్థులకు ఇంగ్లిష్‌పై పట్టు పెంచారన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతీ స్టూడెంట్ ఇంగ్లిష్ బాగా నేర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికను తిలకించి, సంతోషం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, క్లబ్ సభ్యులు, డీఆర్పీలు పాల్గొన్నారు.

గొర్రెల దొంగల అరెస్టు


ముగ్గురు నిందితులతో కరన్‌కోట పోలీసులు

తాండూరు టౌన్: గొర్రెలను దొంగిలించిన నిందితులను కరన్‌కోట పోలీసులు అరెస్టు చేసినట్లు తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరు మండలం గౌతాపూర్ గ్రామానికి చెందిన మల్లికార్జున్‌కు చెందిన ఆరు గొర్రెలు ఈనెల 6వ తేదీన చోరీకి గురయ్యాయి. దొంగలు స్కార్పియో వాహనంలో వచ్చి చోరీ చేసినట్లు కరన్‌కోట పోలీసులు సీసీ ఫుటేజీల్లో గుర్తించారు. ఈమేరకు ఎస్సై విఠల్‌రెడ్డి విచారణ చేపట్టగా ఒడిశా రాష్ట్రానికి చెందిన తమీమ్, సాజిద్, ముస్తఫా అనే ముగ్గురు నిందితులు హైదరాబాద్‌లోని బోరబండలో పట్టుబడ్డారు. వారి నుంచి స్కార్పియో వాహనంతో పాటు నాలుగు గొర్రెలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బాబులి, దీపు అనే మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు చెప్పారు. ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

నేడు ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాల వేలం

చేవెళ్ల: వివిధ కేసులలో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు చేవెళ్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం సీఐ ఎం.శ్రీలత ఓ ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఈ వేలం ఉంటుందని చెప్పారు. చేవెళ్ల సర్కిల్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు ముందుకు వచ్చి వేలంలో దక్కించుకోవాలని కోరారు.

తహసీల్దార్ ఎదుట నలుగురి బైండోవర్

తలకొండపల్లి: భూమి విషయంలో తగాదా పడుతున్న నలుగురిని స్థానిక తహసీల్దార్ నాగార్జున ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. తలకొండపల్లి గ్రామానికి చెందిన అనుపాటి యాదయ్య, అనుపాటి గణేష్, అనుపాటి ఆంజనేయులు, అనుపాటి పార్వతమ్మలకు శివారులో కొంత పొలం ఉంది. కొన్నేళ్ల నుంచి ఆ పొలం విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇరువర్గాల మధ్య కేసులు నమోదయ్యాయి. ఎస్‌ఐ శ్రీకాంత్ గురువారం తహసీల్దార్ ఎదుట నలుగురిని హాజరు పరిచారు.

పీఏసీఎస్ కార్యదర్శిపై వేటు

మంచాల: మంచాల పీఏసీఎస్ కార్యదర్శిగా పనిచేసిన శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ వెదెరె హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఆయన మీడియాకు వెల్లడించారు. పీఏసీఎస్‌లో రూ.7,25,223 సంబంధించిన అవకతవకలపై నిర్వహించిన విచారణలో భాగంగా డీసీఓ ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

కడాయి కష్టాలకు చెక్!


గంపలతో పసుపును నింపుతున్న రైతులు


స్టీమ్ మిషన్ ద్వారా పసుపు ఉడకబెడుతున్న రైతులు


ఉడికించిన అనంతరం ఆరబెట్టేందుకు కుప్పలుగా వేసిన పసుపు

- పది నిమిషాల్లో 'పసుపు' రెడీ!
- ఆవిరి పద్ధతిలో ఉడకబెట్టడం సులభం
- ఖర్చు, సమయం తక్కువే
- సంతోషం వ్యక్తంచేస్తున్న రైతులు

ధారూరు: పసుపు రైతులకు కడాయి కష్టాలు తప్పాయి. నీటి ఆవిరి ద్వారా పసుపు ఉడకబెట్టే ప్రక్రియ మండలంలోని కేరెళ్లిలో ప్రారంభమైంది. కేరెళ్లి, ఎబ్బనూర్ గ్రామాల్లో పసుపు సాగు చేసిన కర్షకులు ఇందుకు శ్రీకారం చుట్టారు. ఈ విధానంలో 6వేల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న ఒక ట్యాంకు, 18 గంపల చొప్పున పసుపు నిల్వ సామర్థ్యం రెండు ట్యాంకులను ప్రత్యేకంగా తయారు చేయించిన ట్రాక్టర్ ట్రాలీపై అమర్చారు. నీటి ట్యాంకు నుంచి నేరుగా పసుపు నింపిన ట్యాంకుల్లోకి ఆవిరి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. ముందుగా ట్యాంకుల్లోని నీటిని కట్టెలతో మరిగిస్తారు. ఇందుకు కనీసం 3 గంటల సమయం పడుతుంది. నీటి వేడిమి 110 డిగ్రీల సెల్సియస్ దాటగానే ఆవిరి బయటకు వస్తుంది. దీన్ని పసుపు నింపిన రెండు ట్యాంకుల్లోకి పంపిస్తారు. అనంతరం 10 నిమిషాల వ్యవధిలో పసుపు ఉడుకుతుంది. ఉడికిన పసుపును బయటకు తీసి ఎండలో ఆరబెడుతారు. దీనిద్వారా పని సులువుగా పూర్తవుతోందని, పసుపు నాణ్యత, బరువుకు నష్టం కలగడం లేదని రైతులు చెబుతున్నారు. ఇలా గంటకు నాలుగున్నర క్వింటాళ్ల పుసును ఉడకబెట్టవచ్చని పేర్కొంటున్నారు.

ట్యాంకు పసుపుకు రూ.300

కేరెళ్లి, ఎబ్బనూర్ గ్రామాల్లో రైతులు పండించిన పసుపు కల్లాల వద్దకు స్టీమ్ బాయిల్ మిషన్‌ను తీసుకెళ్తున్నారు. ఒక ట్యాంకు పసుపును ఉడకబెట్టేందుకు రూ.300 తీసుకుంటున్నారు. అంటే ఒకసారి రెండు ట్యాంకుల్లో ఉడికించే పసుపునకు రూ.600 చెల్లించాలి. కడాయిలో ఉడకబెట్టే విధానం ద్వారా సమయంతో పాటు ఖర్చు ఎక్కువగా పడుతుంది. స్టీమ్ విధానంలో ఎక్కువ, తక్కువ ఉడకడం అనేది లేదని, పసుపునకు మార్కెట్‌లో మంచి ధర పలికేందుకు దోహదం చేస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

సకాలంలో మార్కెట్‌కు..



ఇంతకు ముందు కడాయిల్లో పసుపు ఉడకడెట్టేవాళ్లం. రోజుకు మూడు కడాయిల పసుపును మాత్రమే ఉడికేది. ఆవిరి యంత్రం వచ్చిన తర్వాత కేవలం గంటలోపే ఎకరా పొలంలో సాగుచేసిన పసుపును ఉడకబెడుతున్నాం. నేను 88 ట్యాంకుల పసుపు ఉడకబెట్టించా. దీంతో సకాలంలో పసుపును మార్కెట్‌కు తరలించే వీలు కలిగింది.

– చెన్నారెడ్డి, రైతు కేరెళ్లి

చిన్నారి ఆపరేషన్‌కు మార్గం సుగమం


ఆస్పత్రిలో చిన్నారితో తల్లిదండ్రులు

యాలాల: అరుదైన కాలేయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి ఆపరేషన్‌కు మార్గం సుగమమైంది. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి పిలుపుతో స్పందించిన దాతలు రూ.16 లక్షల వరకు సమకూర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సంగెంకుర్దుకు చెందిన శివకుమార్, భానుప్రియ దంపతుల తొమ్మిది నెలల కుమారుడు వశిష్ట కాలేయ వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. ఇందుకోసం రూ.25 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు పేర్కొనడంతో బాధిత తల్లిదండ్రులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూశారు. తమ గోడును శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో దాతల సహకారం కోరారు. చిన్నారికి చెన్నైలో ఆపరేషన్ చేయించనున్నట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన విద్యావేత్త రామకృష్ణ, యువ నాయకుడు వికాస్ జోషికి కృతజ్ఞతలు తెలిపారు.

డప్పు జారిపోతోందని..

ట్రాక్టర్‌పై నుంచి కింద పడి వ్యక్తి దుర్మరణం


కాశప్ప మృతదేహం

దౌల్తాబాద్: దర్గాకు మొక్కులు తీర్చుకోవడానికి వెళ్తూ ట్రాక్టర్‌పై నుంచి ఓ వ్యక్తి కింద పడి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... కొడంగల్ మండలం కస్తూరుపల్లికి చెందిన కాశప్ప(55) డప్పు కొడుతూ జీవనం సాగించేవాడు. గురువారం ఆయన గ్రామస్తులతో కలిసి కుప్పగిరి గ్రామంలో దర్గాకు గ్యారీం చేయడానికి ట్రాక్టర్‌లో వెళుతున్నారు. మార్గమధ్యలో కుప్పగిరి శివారులోకి రాగానే కాశప్ప చేయికి తగిలించుకున్న డప్పు జారిపోవడంతో పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కింద పడడంతో వెనక టైర్ ఆయనపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని దౌల్తాబాద్ ఎస్‌ఐ రవిగౌడ్ పరిశీలించారు. మృతుడి భార్య ఆశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కుమారులు ఉన్నారు.

పంట నష్టాన్ని అంచనా వేస్తాం


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు


పొలంలో రాలిన వడ్లు

- ఏడీఏ శంకర్ రాథోడ్
- దుద్యాల్‌లో దెబ్బతిన్న పంటల పరిశీలన

దుద్యాల్: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను కొడంగల్ ఏడీఏ శంకర్ రాథోడ్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని చిలుములమైల్వార్ గ్రామంలో వడగళ్ల వానకు చాలా మంది రైతుల పొలాల్లో వడ్లు రాలిపోయినట్లు తెలియజేయడంతో వ్యవసాయ అధికారులు నష్ట నిర్ధారణకు పర్యటించారు. ఈ సందర్భంగా ఏడీఏ శంకర్ రాథోడ్ మాట్లాడుతూ.. గ్రామంలో విపరీతమైన వేగంతో గాలులు వీచి, వడగళ్లతో కూడిన వర్షానికి పంటలు మొస్తరుగా దెబ్బతిన్నాయన్నారు. ముఖ్యంగా కోత దశలో ఉన్న వరి పొలాలు ఎక్కువగా పాడైనట్లు పేర్కొన్నారు. ఏఓ హిమబిందు, ఏఈఓ జ్యోతిలతో కలిసి పంట నష్టాన్ని అంచనా వేశారు. ఏ రకం పంట అయిన దాదాపు 33 శాతం ధాన్యం రాలిపోతేనే నష్టం జరిగినట్లు నిర్ధారణకు వస్తామని రైతులకు వివరించారు. మొక్కకు, మొక్కకు ఉన్న ధాన్యాన్ని పరిశీలించి.. రాలింది ఎంత? ఉన్నది ఎంత అనే కోణంలో పరిశీలన చేస్తున్నామని తెలిపారు. రెండు రోజుల్లో ఎంత మంది రైతుల పొలాల్లో నష్టం జరిగిందో ప్రకటిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో రైతులు నర్సిములు, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాదులు శుభ్రం.. మొక్కలు భద్రం

సాక్షి ఎఫెక్ట్..

నవాబుపేట: 'మొక్కలు నాటారు.. సంరక్షణ మరిచారు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నారెగూడ నుంచి పూలపల్లి వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కల చుట్టూ ఏపుగా పెరిగిన గడ్డి ఎండిపోయింది. ఈ రూట్లో ప్రయాణించే వారు సిగరెట్, బీడీ వంటివి తాగి పడేస్తుండటంతో గడ్డికి మంటలు అంటుకుని, మొక్కలు కాలిపోతున్నాయి. ఈ విషయాన్ని సాక్షి వెలుగులోకి తెచ్చింది. దీంతో గురువారం ఉపాధి కూలీలతో పాదులను శుభ్రం చేయించారు. మొక్కలు ఏపుగా పెరిగేందుకు తగిన జాగ్రత్తలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.


నారెగూడలో మొక్కల చుట్టూ పెరిగిన గడ్డిని తొలగిస్తున్న కూలీలు

బహిరంగ మార్కెట్‌లో పశువైద్యం మందులు


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న స్థానిక రైతులు, నాయకులు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న పాడిరైతులు

కుల్కచర్ల: పశు సంవర్ధకశాఖకు సంబంధించిన మందులు బహిరంగ మార్కెట్‌లోకి దర్శనమిస్తున్నాయని చౌడాపూర్, వీరాపూర్ గ్రామాల పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురువారం పశు సంవర్ధకశాఖకు అనుబంధంగా ఉన్న మైత్రి సంస్థకు చెందిన ఓ వ్యక్తి పశువైద్యానికి సంబంధించిన కొన్ని మందులను బయటకు తీసుకువెళ్తున్న క్రమంలో కొందరు రైతులు అతడిని ఆపి విచారించారు. తాము అడిగితే ఇవ్వకుండా బయటకు ఎలా తీసుకెళ్తున్నావ్ అంటూ నిలదీశారు. వెటర్నరీ అధికారులు తమకు నచ్చిన వారికి, మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని రైతులు ఆరోపించారు. స్థానిక జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అగ్నిపథ్‌కు జిల్లావాసుల ఎంపిక


శ్రీనివాస్


రాహుల్


శ్రీనివాస్


వెంకటేశ్

దోమ: ఆర్మీ నియామకాల్లో భాగంగా అగ్నిపథ్ కింద మండలం నుంచి అగ్నివీర్‌కు గురువారం నలుగురు సెలక్ట్ అయ్యారు. మోత్కూర్ గ్రామం నుంచి మడుగు శ్రీనివాస్, బొంపల్లి నుంచి చంద్రకంటి రాహుల్, ఐనాపూర్ నుంచి నల్ల శ్రీనివాస్, గుడ్ల వెంకటేశ్ అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్‌కు ఎంపిక అయ్యారు. నలుగురు పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆర్మీలో మెరిసిన ఇప్పాయిపల్లి యువకులు


అభిలాష్ ముదిరాజ్


గణేశ్ గౌడ్


అఖిల్ యాదవ్

కుల్కచర్ల: ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా నిర్వహించిన పరీక్షల్లో కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లికి చెందిన యువకులు ప్రతిభ కనబరిచి ఉద్యో గాలు సాధించారు. ఆరు నెలల క్రితం ఆర్మీ ఎంపిక పరీక్షలు నిర్వహించగా గురువారం ఫలితాలు వెలువడ్డాయి. గ్రామానికి చెందిన అభిలాష్ ముదిరాజ్, గణేశ్ గౌడ్, అఖిల్ యాదవ్ ఎంపికయ్యారు. ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన యువకులకు గ్రామస్తులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

హస్నాబాద్ నుంచి ముగ్గురు


సాయికృష్ణ గౌడ్


శ్రీనివాస్


సంతోష్

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన మఠం సాయికృష్ణ గౌడ్, కొత్త శ్రీనివాస్, నాయికోటి సంతోష్ ఎంపికయ్యారు. ఒకే గ్రామం నుంచి ముగ్గురు యువకులు ఆర్మీలో ఉద్యోగాలకు ఎంపిక కావడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ గ్రామం నుంచి ఇప్పటికే వంద మందికి పైగా ఆర్మీలో ఉన్నారు.

తరిగోపుల గ్రామం నుంచి అన్నదమ్ములు


విష్ణు, శివ

ధారూరు: మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన అన్నదమ్ములు ఆర్మీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన కుర్వ మల్లేశంకు నలుగురు సంతానం. గురువారం విడుదలైన అగ్నిపథ్ పరీక్షల ఫలితాల్లో విష్ణు, శివ సత్తాచాటారు. తన కుమారులు దేశ సేవ చేయాలనే సంకల్పంతో ఆర్మీలో చేరడానికి శ్రమించారని తండ్రి మల్లేశం తెలిపారు.

విజయశాంతికి మంత్రి పదవి ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: త్వరలో చేపట్టే మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్సీ విజయశాంతికి చోటు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తెల్లి లక్ష్మణ్‌యాదవ్ గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన వర్గానికి చెందిన ఆడబిడ్డకు మంత్రి పదవి ఇస్తే బీసీలకు న్యాయం చేసినట్లు అవుతుందన్నారు. తెలంగాణ బీసీ వర్గం అంతా ఎమ్మెల్సీ విజయశాంతికి మద్దతుగా నిలుస్తుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం తరఫున సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవిస్తామన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


లక్ష్మయ్య (ఫైల్)

పూడూరు: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ ఉదాన్‌రావు లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు గురువారం ఆయన అంత్యక్రియలు పూడూరులో నిర్వహించారు. ఆయన గ్రామానికి చేసిన సేవలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి, సెన్సార్‌బోర్డు సభ్యుడు మల్లేషపటేల్‌లు గుర్తు చేశారు. మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు తదితరులు అంజలి ఘటించారు.

గంజాయి పట్టివేత

తాండూరు రూరల్: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గౌతపూర్ చెక్‌పోస్ట్ వద్ద గురువారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. తాండూరు పట్టణానికి చెందిన వినోద్ కుమార్, హర్షద్‌లు బైక్‌పై వెళుతుండగా.. నమ్మదగిన సమాచారం మేరకు వారిని తనిఖీ చేయగా గంజాయి లభించింది. 160 గ్రాముల గంజాయి పట్టుబడింది. వెంటనే ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాతబస్తీలో పన్ను వసూలు చేయాలి


దీక్షలో మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

- బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్
- మీర్‌పేటలో ఆస్తి పన్ను తగ్గించాలని రిలే నిరాహారదీక్ష

మీర్‌పేట: మీర్‌పేటవాసులపై ఇంటి పన్ను భారం తగ్గించి, పాతబస్తీలో పన్ను వసూలు చేయాలని బీజేపీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. గురువారం ఇంటి పన్ను తగ్గించాలని డిమాండ్ చేస్తూ మీర్‌పేట–1, 2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్ష చేపట్టారు. దీనికి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్‌శంకర్‌రెడ్డిలతో కలిసి శ్రీరాములుయాదవ్ పాల్గొని మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే ప్రాంతంలో ప్రభుత్వం ఇంటి పన్ను రూపంలో భారం వేస్తోందని, దీనిపై గతంలో నుంచే బీజేపీ పోరాటం చేస్తోందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన 15 నెలలకే అప్పటి బీఆర్‌ఎస్ కంటే కాంగ్రెస్ ప్రభుత్వమే అధిక పన్ను వసూలు చేస్తుందని ఆరోపించారు. మీర్‌పేటలో పన్నులు తగ్గించకుంటే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో నాయకులు పాల్గొన్నారు.

కీలక శాఖ.. సిబ్బంది లేక


దౌల్తాబాద్ తహసీల్ కార్యాలయం

- దౌల్తాబాద్‌లో 33 జీపీలకు ఒకే ఆర్‌ఐ
- పనుల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- నియమించాలని విజ్ఞప్తులు

దౌల్తాబాద్: ప్రభుత్వ యంత్రాంగంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైంది. అటువంటి శాఖలో సిబ్బంది కొరత ప్రజలను వేధిస్తోంది. పనులు కాకపోవడంతో దరఖాస్తుదారులు కాళ్లరిగేలా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇదీ దౌల్తాబాద్ మండలంలో నెలకొన్న దుస్థితి. మండలంలో 33 గ్రామపంచాయతీలు ఉండగా స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఇది వరకు ఇద్దరు గిర్దావార్‌లు(ఆర్‌ఐ) పనిచేసేవారు. అయితే ఇక్కడ పనిచేసిన ఆర్‌ఐ చంద్రశేఖర్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న నేపథ్యంలో తహసీల్దారు కలెక్టరేట్‌కు సరెండర్ చేశారు. దీంతో ఇప్పుడు ఒకే గిర్దావార్ ఉన్నారు. దీంతో పనులు పూర్తికాక మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. దేనికోసమైనా దరఖాస్తు చేసుకుంటే రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరు వెంటనే స్పందించి గిర్దావార్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆసక్తి చూపని ఉద్యోగులు

దౌల్తాబాద్ మండలానికి పనిచేసేందుకు అధికారులు కూడా ఆసక్తి చూపడంలేదని సమాచారం. గ్రామీణ ప్రాంతం కావడంతో సౌకర్యాలు ఉండవనే భ్రమలో విముఖత వ్యక్తం చేస్తున్నారు. పక్కనే కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ఉండడం సైతం ఇక్కడ పని చేయడానికి ససేమిరా అంటున్నారు.

ఇబ్బంది పడుతున్న సిబ్బంది

ప్రజలు అందించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడం కష్టంగా మారింది. గతంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏలు ఉంటే వారి నుంచి వివరాలను సేకరించి సర్టిఫికెట్‌ను అందించే వారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గిర్దావరే క్షేత్రస్థాయిలో వెళ్లి విచారణ చేయడం సాధ్యం కాకపోవడంతో పాటు పనిభారం పెరిగి ఇబ్బంది పడాల్సి వస్తుంది. అలాగే సీనియర్ అసిస్టెంట్ కూడా లేకపోవడంతో కార్యాలయంలో పనులు కాక తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ఇక్కడ ఉన్న ఇద్దరు గిర్దావర్‌లలో ఒకరిని అవినీతి ఆరోపణల నేపథ్యంలో కలెక్టరు కార్యాలయానికి సరెండర్ చేశాం. ప్రస్తుతం ఉన్న ఒకరితో కొంత మేర ఇబ్బందులు ఉన్నా పనులు చేయిస్తున్నాం. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. విద్యార్థుల సర్టిఫికెట్లు కూడా అందిస్తున్నాం.

– గాయత్రి, తహసీల్దార్, దౌల్తాబాద్